

హైదరాబాద్ వార్త

# ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో చేప ప్రసాదం

## రెండు రోజులపాటు ట్రాఫిక్ ఆంక్షలు



**హైదరాబాద్ జూన్ 7 ప్రభాతవార్త :** మృగశిర కార్తెలో చేప ప్రసాదం పంపిణీకి రంగం సిద్ధమైంది. బత్తిని సోదరుల ఆధ్వర్యంలో నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జరగనున్న ప్రతిష్ఠాత్మక చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమాన్ని పురస్కరించుకుని నగర ట్రాఫిక్ పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. దేశం నలుమూలల నుంచి లక్షలాది మంది ప్రజలు ఈ ప్రసాదం కోసం తరలివచ్చే అవకాశం ఉన్నందున ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ కాకుండా ఉండేందుకు ముందస్తుగా ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు పోలీసులు ప్రకటించారు. చేపప్రసాదం పంపిణి కారణంగా సోమవారం ఉదయం 6 గంటల నుంచి మంగళవారం రాత్రి 8 గంటల వరకు నాంపల్లి, ఆ పరిసర రనపాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు పూర్తిగా అమల్లో ఉంటాయి. దీంతో సాధారణ వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని అధికారులు సూచించారు. ఆదేవిధంగా చేప ప్రసాదం కోసం వివిధ ప్రఆంతాల నుంచి సొంత వాహనాల్లో వచ్చే భక్తుల సౌకర్యార్థం పోలీసులు ప్రత్యేక పార్కింగ్ స్థలాలను కేటాయించారు.

నాంపల్లి వైపు నుంచి వచ్చే వాహనాలు గృహకల్ప, గగన్ విహార్, చంద్ర విహార్ ప్రాంతాల్లో పార్క్ చేయాలని, ఎంజే మార్కెట్ వైపు నుంచి వచ్చే బస్సులు, వ్యాన్లలోని ప్రయాణికులకు గాంధీ భవన్ బస్ స్టాప్ వద్దకు అనుమతి.. నాంపల్లి వైపు నుంచి వచ్చే వారు గృహకల్ప బస్ స్టాప్ వద్దకు అనుమతించనున్నట్లు తెలిపారు. వీఐపీ కార్ పాస్ హోల్డర్ల కోసం ప్రత్యేక ప్రవేశ మార్గాలు, ప్రత్యేక పార్కింగ్ ఏర్పాట్లు చేశారు. ద్విచక్ర వాహనదారుల కోసం మనోరంజన్ కాంప్లెక్స్, భీమ్రావ్ బాడా ప్రాంతాల్లో పార్కింగ్ స్థలాల ఏర్పాటు చేశారు. ఆటోలలో వచ్చే భక్తులు షెజాన్ హోటల్ ఎదురుగా ఏర్పాటు చేశారు.

**పార్కింగ్ స్థలాలు ఇవే...**

కారు, భారీ ఫోర్ వాహనాలను గృహకల్ప, గగన్‌విహార్, చంద్రవిహార్ సమీపంలో పార్కింగ్ చేయాల్సి ఉంటుంది. బస్సులు, వ్యాన్లలో వచ్చే వారు గాంధీభవన్, గృహకల్ప బస్‌స్టాప్‌ల వద్ద దిగి, అక్కడి నుంచి కాలినడకన ఎగ్జిబిషన్ గ్రౌండ్‌కు చేరుకోవాలి. బైక్‌లపై వచ్చేవారు కోసం మనోరంజన్ కాంప్లెక్స్, భీమ్‌రావుబాడా ప్రాంగణాల్లో ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాలను సిద్ధం చేశారు. చివరగా ఆటోల్లో వచ్చే ప్రయాణికులు కోసం షెజాన్ హోటల్ వద్ద ఆటోలో దిగి లోపలికి వెళ్లే ఏర్పాటు చేశారు.

**ట్రాఫిక్ మళ్లింపులు ఇవే...**

-ఎంజే మార్కెట్ నుంచి వచ్చే వాహనాలను అబిడ్స్, జీపీఓ, నాంపల్లి వైపుకు మళ్లిస్తారు.

- ఎంజే బ్రిడ్జ్, బేగంబజార్ ఛత్రి వైపు నుంచి నాంపల్లి వెళ్లే సాధారణ ట్రాఫిక్కు అలాస్కా జంక్షన్ వద్ద దారుస్సలాం, ఏక్ మినార్ ప్రాంతాల వైపునకు మళ్లిస్తారు.
- ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు, భారీ వాహనాలపై ప్రత్యేక ఆంక్షలు.
- ఎంజే మార్కెట్-తాజ్ ఐలాండ్ మార్గంలో వీటికి అనుమతి ఉండదు.
- హైదరాబాద్ ప్రజలు ట్రాఫిక్ మళ్లింపులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని ట్రాఫిక్ పోలీసుల విజ్ఞప్తి చేశారు.

# లక్షల్లో ఎల్‌కెజి చదువులు..!

*** సిబిఎస్ఈ, ఐసిఎస్ఈ స్కూళ్లలో ప్రవేశాలు ప్రారంభం * ప్రభుత్వ నియంత్రణ లేక నిర్వాహకుల ఇష్టారాజ్యం**



**హైదరాబాద్, జూన్ 7, ప్రభాతవార్త**

గ్రేటర్‌లోని సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ పాఠశాలల్లో నూతన ప్రవేశాలు అప్పుడే ప్రారంభమయ్యాయి. మరో వారం రోజుల్లో విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో పలు విద్యాసంస్థలు అడ్మిషన్లకు తెరదీశాయి. రూ. లక్షల ఫీజులు డిమాండ్ చేస్తున్నాయి. గ్రేటర్ పరిధి హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ స్కూళ్లు దాదాపు 60 వరకు ఉన్నాయి. మిగతావి కార్పొరేట్, టెక్నో, బడ్జెట్ బదులుగా కొనసాగుతున్నాయి. కొన్ని ప్రైవేట్ ఇంటర్నేషనల్, కార్పొరేట్ విద్యాసంస్థలు ధనార్జనే ధ్యేయంగా ముందుకు సాగుతున్నాయి. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ స్కూల్ అడ్మిషన్, రెగ్యులర్ ఫీజులను ఇష్టారాజ్యంగా పెంచి తల్లిదండ్రుల జేబులను గుల్ల చేస్తున్నాయి. నగరంలోని ఓ ప్రైమరీ స్కూల్‌లో నర్సరికి రూ. 2.51 లక్షలు, ఫస్ట్, సెకండ్‌క్లాసులకు రూ. 2.91 లక్షలు వసూలు చేస్తున్నారని ఓ మహిళ కొన్ని నెలల క్రితం తన ట్విట్టర్ ఖాతా (ఎక్స్)లో పోస్టు చేయడం చర్చనీయాంశమైంది. ఏబీసీడీలు నేర్చుకునేందుకు నెలకు రూ. 21 వేలా అంటూ ఆమె వాపోయారు.

**ఫీజులను నియంత్రించాలి...**

2026-27 విద్యా సంవత్సరం ప్రారంభానికి వారం రోజుల సమయం ఉన్నప్పటికీ గ్రేటర్‌లోని పలు సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ పాఠశాలల యాజమాన్యాలు అక్రమార్జనకు తెరలేపాయి. తల్లిదండ్రుల ఆసక్తిని గమనించి అడ్మిషన్ల ఫీజును అడ్డగోలుగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇక హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో భారీ ఫీజులకు వ్యతిరేకంగా ఇటీవల విద్యార్థుల తల్లిదండ్రులు పెద్దఎత్తున ఆందోళన చేపట్టినా.. ప్రభుత్వం స్పందించకపోవడం గమనార్హం. నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు వసూలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకునే వారే కరువయ్యారని విద్యార్థి సంఘాల నాయకులు మండిపడుతున్నారు. అడ్మిషన్లకు రూ. లక్షల వసూళ్లతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన పిల్లలు ఆయా విద్యాసంస్థల్లో చదువుకునే అవకాశం లేకుండా పోతోందని పేర్కొంటున్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని ఫీజులను నియంత్రించాలని కోరుతున్నారు.

**అనుమతులా అవెక్కడ..!**

అధికారుల పర్యవేక్షణ లోపం, ఉన్నతాధికారుల పట్టింపులేనితనం ఫలితంగా ప్రీ స్కూల్ విద్యకు విఘాతం కలుగుతోంది. లోకం పోకడ తెలియని చిన్నారులను అక్కున చేర్చుకుని పాఠశాల విద్యపై ఆసక్తి కల్పిస్తున్నామని చెబుతున్న కొన్ని ప్రైవేట్ యాజమాన్యాలు దొరికినకాడికి దోచుకుంటున్న పరిస్థితి కనిపిస్తోంది. విద్యాశాఖ నుంచి అనుమతులు తీసుకోకుండా, పిల్లలకు కనీస సౌకర్యాలు కల్పించకుండా ఇష్టా రాజ్యంగా తరగతులను నిర్వహిస్తున్నాయి.

నగరంలో నడుస్తున్న ప్రీస్కూళ్లలో 40 శాతం వరకు అనుమతిలేకుండానే నడిపిస్తున్నట్లు సమాచారం. కొంతమంది నిర్వాహకులు చిన్నపాటి ఇళ్లను అద్దెకు తీసుకుని నడుపుతున్నారు. పలు చోట్ల కేవలం రెండు, మూడు గదుల్లోనే పిల్లలకు ఆటబొమ్మలు, ఆట వస్తువులు ఏర్పాటుచేసి నిర్వహిస్తున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 11.30 గంటల వరకు నడుపుతున్న పాఠశాలలకు భారీగానే ఫీజులు వసూలు చేస్తున్నారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్, అమీర్‌పేట్, ముషీరాబాద్, అంబర్‌పేట్, సికింద్రాబాద్, ఉప్పల్, బోడుప్పల్, నాంపల్లి, గోల్కొండ, చార్మినార్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ప్రీ స్కూళ్లలో కొంతమంది నిర్వాహకులు అడ్మిషన్ ఫీజుగా రూ.40 వేల నుంచి 25 వేల వరకు తీసుకుంటున్నట్లు తెలిసింది. అలాగే నెలవారీ ఫీజు కింద రూ.1500-2000 వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం.

# బార్‌లో ఘర్షణ.. కేసు నమోదు

**జూబ్లీహిల్స్, జూన్ 7, ప్రభాతవార్త :**

బిల్లు విషయంలో పంజాగుట్టలోని మధులోక బార్‌లో గొడవ చోటుచేసుకొంది. ఈ సంఘటనపై పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. పంజాగుట్ట పోలీసుల కథనం ప్రకారం.. పంజాగుట్టలోని మధులోక బార్ అండ్ రెస్టారెంట్‌కు శనివారం రాత్రి సాయిసచిన్, భీంచంద్‌తోపాటు మరో ముగ్గురు స్నేహితులు వచ్చారు. మద్యం తాగుతున్న క్రమంలో వీరిలో ఇద్దరు స్నేహితులు ముందుగానే బార్‌లో నుంచి వెళ్లిపోగా మరో ముగ్గురు బార్‌లోనే మద్యం తాగగా రూ. 5వేలు బిల్ అయింది. కాగా మద్యం తాగిన ముగ్గురు స్నేహితులు సైతం లిఫ్టు వద్దకు వెళ్లగా సెక్యూరిటీ వారిని అడ్డుకున్నారు. బిల్లు కట్టకుండా ఎలా వెళ్తారంటూ ప్రశ్నించడంతో ఇరువర్గాల మధ్య గొడవ జరిగి ఘర్షణకు దారితీసింది. తమ స్నేహితులు బిల్లు చెల్లించి ఉంటారని భావించి వెళ్తున్నట్లు చెప్పారు. ఈ సంఘటనపై బార్‌కు చెందిన బంజారాహిల్స్‌కు చెందిన వ్యాపారవేత్త గోవర్ధన్‌రెడ్డి పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు సాయిసచిన్, భీంచంద్ తదితరులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మద్యం మత్తులో స్నేహితులు ఒకరిపై ఒకరు దాడి

**ముషీరాబాద్, జూన్ 7, ప్రభాతవార్త:**

మద్యం మత్తులు ఇద్దరు స్నేహితులు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న ఘటన దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. దోమలగూడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఢిల్లీకి చెందిన సోను కుమార్ (42) కుక్‌గా పనిచేసేవాడు. అదే ప్రాంతానికి చెందిన శంకర్ (42) కుక్‌గా పనిచేస్తూ, సోను కుమార్‌తో కలసి లోయర్ ట్యాంక్‌బండ్‌లోని వార్త కార్యాలయం వద్ద ఒక గదిలో అద్దెకు నివసిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం రాత్రి ఇద్దరూ మద్యం సేవించి ఉన్న సమయంలో తలుపులు వేసే విషయంలో ఇద్దరి మధ్య వాదన జరిగింది. దీనతో ఇద్దరూ ఒకరిపై ఒకరు దాడి చేసుకోవటంతో ఇద్దరి తలలకు స్వల్పంగా గాయాలయ్యాయి. ఆదివారం ఇద్దరూ దోమలగూడ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి, ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఇద్దరి పై కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు.

## పెట్టుబడి మోసం.. ఇగ్నైట్ సంస్థ ప్రతినిధులపై కేసు

**జూబ్లీహిల్స్, జూన్ 7, ప్రభాతవార్త:** పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని మోసానికి పాల్పడిన ఇగ్నైట్ సంస్థ ప్రతినిధులపై పంజాగుట్ట ఠాణలో కేసు నమోదైంది. పంజాగుట్ట పోలీసుల కథనం ప్రకారం.. మణికొండకు చెందిన మెరుగు రష్మిత(25)కు రియాజ్ అనే వ్యక్తి పరిచయమై ఇగ్నైట్ అనే సంస్థలో పెట్టుబడి పెడితే భారీ లాభాలు వస్తాయని చెప్పాడు. అనంతరం మహమ్మద్ ఇర్ఫాన్ అనే వ్యక్తి ద్వారా ఆన్‌లైన్‌లో పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహించారు. వారి సూచనల మేరకు రష్మిత మొదట రూ.4,500, అనంతరం 600 అమెరికన్ డాలర్లు (సుమారు రూ.59,399) చెల్లించింది. తర్వాత డబ్బు తిరిగి కోరగా మరింతమంది సభ్యులను చేర్చాలని, అదనపు డబ్బులు చెల్లించాలని షరతులు విధించారు. దీంతో అనుమానం వచ్చిన బాధితురాలు విచారించగా సంస్థ కార్యకలాపాలు మోసపూరితంగా ఉన్నట్లు గుర్తించింది. మొత్తం రూ.63,899 నష్టం వాటిల్లడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు ఇగ్నైట్ సంస్థ ప్రతినిధులైన రియాజ్, మహమ్మద్ ఇర్ఫాన్, అరుణ్ జార్జ్ తదితరులపై ఐటీ చట్టంతోపాటు డిపాజిటర్ల రక్షణ చట్టాల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బ్యాగులో పెట్టిన బంగారు ఆభరణాలు మాయం

**జూబ్లీహిల్స్, జూన్ 7, ప్రభాతవార్త :** రైలులో, క్యాబ్‌లో ప్రయాణించి ఇంటికి చేరిన ఒక మహిళ బ్యాగులోని 152 గ్రాముల బంగారు ఆభరణాలు మాయమైన సంఘటన పంజాగుట్ట ఠాణాలో చోటుచేసుకుంది. పంజాగుట్ట పోలీసుల కథనం ప్రకారం.. సోమాజీగూడ ప్రాంతానికి చెందిన శ్రద్ధా షింగ్నే ఇద్దరు పిల్లలతో కలిసి జూన్ 2న మధ్యప్రదేశ్‌లోని బేతూల్ రైల్వేస్టేషన్‌లో దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ ఎక్కి హైదరాబాద్‌కు బయలుదేరారు. వీరితోపాటు ఆమె తల్లి మాలతి వాంఖెడే, మరదలు సోనాలి వాంఖెడే ప్రయాణించారు. ప్రయాణ సమయంలో సామాన్లన్నింటినీ దిగువ బెర్త్ కింద భద్రంగా పెట్టారు. నగదు, మందులు, మొబైల్ ఫోన్‌తోపాటు బంగారు ఆభరణాలు ఉన్న చిన్న నగల పెట్టెను బ్యాక్‌ప్యాక్‌లో జాగ్రత్తగా పెట్టారు. జూన్ 3 ఉదయం 5 గంటలకు హైదరాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్న తర్వాత బ్యాగుల జిప్పులు, ఇతర వస్తువులు యథావిధిగా ఉన్నాయని గుర్తించారు. క్యాబ్ బుక్ చేసుకొని ఇంటికి చేరుకుని విశ్రాంతి తీసుకున్న తర్వాత నగల పెట్టెను పరిశీలించగా అది కనిపించలేదు. మొత్తం 152 గ్రాముల బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో ఆమె పంజాగుట్ట పోలీసులకు, రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోఈలసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## తల్లి చెంతకు తప్పిపోయిన బాలుడు

**అల్వాల్, జూన్ 7 ప్రభాతవార్త:** తప్పి పోయిన బాలుడిని అల్వాల్ పోలీసులు తల్లి చెంతకు చేర్చారు. ఐదు రోజులు పాటు బాలుని ఆచూకి కోసం నిరంతరాయంగా సాగించిన ప్రయత్నాలు సఫలీకృతం అయ్యాయి. సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. బొల్లారం బజార్ ప్రాంతానికి చెందిన మణికంఠ(7) మే 31వ తేదీ నుంచి కనిపంచకుండా పోయాడు. తల్లి ఫిర్యాదుతో అదృశ్యం కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్ పర్యవేక్షణలో గాలింపు చేపట్టారు. ఈ నెల 7వ తేదీన ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని సంధ్యా థియేటర్ వద్ద బాలుడిని గుర్తించి పోలీసు స్టేషన్‌కు తీసుకుని వచ్చారు. బాలుడి ఆచూకి కనుగొనడంలో బండం బావికి చెందిన కార్తీక్ పోలీసులకు సహకరించాడు. బాలుడు ఆరోగ్యంగా ఉండడంతో తల్లికి అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్ తెలిపారు. బాలుడి కోసం అలుపెరగని ప్రయత్నాలు చేసిన ఎస్ఐ దేవేందర్, కానిస్టేబుల్ సుధాకర్‌లను ఆయన అభినందించారు.




మణిపూర్ సంఘీభావం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ హరగోపాల్

### మణిపూర్ సంక్షోభం వెనుక

## సామాజిక, రాజకీయ కోణాలు

### ప్రొఫెసర్ హరగోపాల్

**చిక్కడపల్లి, జూన్ 7 (ప్రభాతవార్త):** మణిపూర్ సంక్షోభం కేవలం రెండు వర్గాల మధ్య ఘర్షణ మాత్రమే కాదని, దాని వెనుక లోతైన సామాజిక, రాజకీయ కోణాలు ఉన్నాయని ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. ఆదివారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రజా ఉద్యమాల సంఘీభావ కమిటీ ఆధ్వర్యంలో రూపొం దిన మణిపూర్ సంఘీభావం పేరుతో రూపొందిం చిన పుస్తకావిష్కరణ సభ జరిగింది. పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ మణిపూర్‌లో నెలకొన్న అశాంతి, హింసాత్మక పరిస్థితులు దేశవ్యాప్తంగా ప్రతి ఒక్క రినీ ఆలోచింపజేస్తున్నాయన్నారు. అక్కడ నలిగి పోతున్న సామాన్య ప్రజలకు, బాధితులకు అండగా నిలవాల్సి న బాధ్యత సమాజంపై ఉందన్నారు. దేశంలో ఎక్కడ అన్యాయం జరిగినా మేధావులు, సామాజిక శక్తులు గళం విప్పాలన్నారు. ఇలాంటి పుస్తకాలు ప్రజల్లో చైతన్యాన్ని, సంఘీభావ భావాన్ని పెంపొందిస్తాయి అని ఆయన పేర్కొ న్నారు. శాంతిభద్రతలను కాపాడటంలో, ప్రజా స్వామ్య విలువలను రక్షించడంలో పాలకులు విఫలమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పుస్తక సంపాదకులు హేమలలిత వెంకట్‌రావ్ మాట్లాడుతూ మణిపూర్‌లోని యదార్థ పరిస్థితులను, అక్కడి ప్రజల ఆవేదనను బాహ్య ప్రపంచానికి తెలియజేసేందుకే ఈ పుస్తకాన్ని సంకలనం చేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రజా ఉద్య మాల సంఘీభావ కమిటీ ప్రతినిధులు, పీవోడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్య, పాస్టర్ టాంగ్ బాయ్ హాత్సాంగ్, కుకి కమ్యూనిటీ (హైదరాబాద్) చైర్ పర్సన్ పయోలెన్, కుకి స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు విలియం హాకిప్, ఉపాధ్యక్షుడు మాంగ్ పిక్, టిపిఎస్ కె భూపతి వెంకటేశ్వర్లు, రచయిత్రి బండారు విజయ, వివిధ ప్రజా సంఘాల నాయ కులు, మేధావులు, సామాజిక కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రసంగించారు.

## పీపుల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ నాగేశ్వర్

**కంటోన్మెంట్, జూన్ 7 ప్రభాతవార్త:**

మల్కాజిగిరి సఫిల్‌గూడ ప్రాంతానికి చెందిన డాక్టర్ నాగేశ్వర్‌రావ్‌కు కేంద్ర ప్రభుత్వం ద్వారా పీపుల్ ఫోరం ఆఫ్ ఇండియా నేషనల్ భారత్ సేవక్ సమాజ్ రాష్ట్ర అధ్యక్షులుగా నియమిం చినట్లు నేషనల్ చైర్మన్ డాక్టర్ ఎస్.మణి మేజియన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా 5వ వార్డు మారేడ్‌పల్లిలో ఆయన మాట్లాడుతూ దళిత సామాజికవర్గానికి చెందిన తాను మల్కాజిగిరి, కంటోన్మెంట్ ప్రాం తాల్లో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఎస్సీ హక్కుల సంఘం రాష్ట్ర వైస్ చైర్మన్‌గా విధులు నిర్వహించి అనేక సేవలు అందించామన్నారు. పిఎఫ్ఐబిఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షునిగా నియమించినందుకు నాగేశ్వర్‌రావ్ అభినందనలు తెలియజేశారు.

# ఆరోగ్యానికి, పర్యావరణ పరిరక్షణ సైక్లింగ్ మేలు

## మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు




అంతర్జాతీయ సైక్లింగ్‌డే వేడుకలను ప్రారంభిస్తున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

**నార్సింగి, జూన్ 7 ప్రభాతవార్త :** ఆరోగ్యానికి, పర్యావరణ పరిరక్షణకు సైక్లింగ్ ఎంతో మేలు చేస్తుందని మాజీ ఉప రాష్ట్రపతి యం.వెంకయ్య నాయుడు పేర్కొన్నారు. ఆదివారం నార్సింగి ఔటర్ రింగ్ రోడ్డు సైక్లింగ్ ట్రాక్ వద్ద స్మార్ట్బైక్, హైదరాబాద్ బైసైక్లింగ్ క్లబ్, బ్రస్సెల్సుకు చెందిన వరల్డ్ సైక్లింగ్ అలయన్స్, స్పోర్ట్ అథారిటి ఆఫ్ ఇండియా, ఫిట్ ఇండియాల ఆధ్వర్యంలో "మెగా సైక్లింగ్ డే" వేడుకలు వందలాది మంది కేరింతల మధ్య ఘనంగా జరిగాయి. వెంకయ్య నాయుడు ముఖ్య అతిథిగా విచ్చేసి ఈ వేడుకలను జెండా ఊపి ప్రారంభించారు. సైకిల్ ర్యాలీలో పిల్లలు, యువకులు, వృద్ధులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం వెంకయ్యనాయుడు మాట్లాడుతూ పర్యావరణ అనుకూలమైన రవాణాపై అవగాహన పెంచేందుకు స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న కృషి అభినందనీయమైందన్నారు. సైక్లింగ్ మనలను ఆరోగ్యంగా ఉంచడంతో పాటు పోటీ తత్వంను పెంచుతుందన్నారు. ఇంధనం, డబ్బు ఆదా అవుతాయని, ఆరోగ్యం పెరుగుతుందని, పర్యావరణానికి గణనీయమైన సహకారం లభిస్తుందన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలి కోసం సైక్లింగ్‌ను ప్రాచుర్యంలోకి తీసుకు వచ్చేందుకు మనోహర్, ధర్మిన్‌లు చేస్తున్న కృషి అమోఘమన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రపంచ ప్రాధాన్యత కలిగిన అంశమని తెలిపారు. సైక్లింగ్ కేవలం రవాణా మార్గమే కాదని, ఆరోగ్యంను ఇనుమడింపజేస్తుందన్నారు. నేను కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ప్రతీ పట్టణంలో ప్రత్యేక సైక్లింగ్ ట్రాక్‌లను అభివృద్ధి చేయాలని ప్రతిపాదించానని గుర్తు చేశారు. పట్టణ ప్రణాలికలో సైక్లింగ్ మౌలిక సదుపాయాలు అంతర్భాగంగా ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు పిల్లలు, యువత సైక్లింగ్ చేసేలా ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం స్మార్ట్బైక్ చైర్మన్, వర్ల్డ్ సైక్లింగ్ అలయన్స్ తొలి ఉపాధ్యక్షులు డివి.మనోహర్ మాట్లాడుతూ సైక్లింగ్‌కు ప్రత్యేకంగా ఓ అంతర్జాతీయ దినోత్సవం ఉండాలని తామంతా ఏళ్ల తరబడి తీవ్రంగా కృషిచేశామని, 2018లో ఫలితంను సాధించామని వివరించారు. న్యూఢిల్లీలో మొదటి అంతర్జాతీయ సైక్లింగ్ డే వేడుకలు నిర్వహించామని, నాటి ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు హాజరై మమ్ములను ప్రోత్సహించిన తీరును ఎన్నటికి మరువలేమన్నారు. ఈ కార్యక్రమంలో ఏయిర్ కమోడోర్ శ్రీనాథ్ ఫిళ్లై, భారత బయోటెక్ డైరెక్టర్ రాచెస్ ఎల్లా, హైదరాబాద్ బైసైక్లింగ్ క్లబ్ అధ్యక్షులు టి.సత్యనారాయణరెడ్డిలతో పాటు 2,500.మంది సైక్లిస్టులు పాల్గొన్నారు.

# ఆరోగ్య పరిరక్షణకు సైక్లింగ్ దోహదం

## రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్‌శుక్లా

**గచ్చిబౌలి, జూన్ 7 ప్రభాతవార్త:** వరల్డ్ సైక్లింగ్ డేను పురస్కరించుకొని ఆదివారం ఫిట్ ఇండియా ఆధ్వర్యంలో గచ్చిబౌలిలో నిర్వహించిన సండేస్ ఆన్ సైక్లింగ్ ఉత్సాహంగా సాగింది. తెలంగాణ స్పోర్ట్స్ ఆథారిటీ ఆధ్వర్యంలో గచ్చిబౌలి స్టేడియం వేదికగా నిర్వహించిన ఈ ర్యాలీకి నగరంలోని ఔత్సాహికులు భారీఎత్తున హాజరయ్యారు. ఆదివారం ఉదయం తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్‌శుక్లా ముఖ్య అతిధిగా హాజరై సైకిల్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. రాష్ట్ర ఐటి శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు, క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్ శివ్‌ప్రతాప్‌శుక్లా మాట్లాడుతూ ఫిట్ ఇండియా ఆధ్వర్యంలో సండేస్ ఆన్ సైకిల్ కార్యక్రమాన్ని రాష్ట్రంలో విస్తృత స్థాయిలో నిర్వహిస్తున్నారని, రాష్ట్రంలో అద్భుతమైన క్రీడా ప్రతిభ ఉందన్నారు. సైక్లింగ్ ఆరోగ్యాన్ని పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ఎంతో దోహదపడుతుందన్నారు. ప్రజలు రోజువారి జీవితంలో సైక్లింగ్‌కు స్థానం కల్పించాలని పిలుపునిచ్చారు. సైకిల్‌ను సరసమైన రవాణా సాధనంగా, పర్యా వరణహిత ప్రయాణ సాధనంగా, సమర్థవంతమైన ఫిట్‌నెస్ కార్యక్రమంగా గుర్తిస్తుందన్నారు. మహానగరం వంటి హైదరాబాద్‌లో ట్రాఫిక్ రద్దీ తగ్గించడంతో పాటు ఆరోగ్యకరమైన నగరంగా తీర్చిదిద్దేందుకు సైక్లింగ్ ఓ అద్భుత పరిష్కారమన్నారు. కాగా గచ్చిబౌలి స్టేడియం ప్రధానగ్రౌండ్ నుంచి ప్రారం భమైన ఈ సైకిల్ ర్యాలీ ట్రిపుల్‌ఐటీ జంక్షన్, గచ్చిబౌలి ఫ్లైఓవర్, పిస్తా హౌజ్, కేబుల్ బ్రిడ్జి, మాదాపూర్, బయోడైవర్‌సిటీ రోడ్డు మీదుగా తిరిగి గచ్చిబౌలికి స్టేడియంకు చేరుకుంది. ర్యాలీలో పాల్గొన్నవారికి తెలంగాణ స్పోర్ట్స్ ఆథారిటీ ఆధ్వర్యంలో సర్టిఫికేట్లు, మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ క్రీడా సలహాదారు జితేందర్‌రెడ్డి, స్పోర్ట్స్ ఆథారిటీ చైర్మన్ శివసేనరెడ్డి, సైబరాబాద్ పోలీసు కమిషనర్ రమేష్‌రెడ్డిలతో పాటు స్పోర్ట్స్ ఆథారిటీ అధికారులు, సైక్లింగ్ అసోసియే షన్ క్రీడాకారులు, సైక్లిస్టులు పాల్గొన్నారు.



సండేస్ ఆన్ సైకిల్ రైడ్‌లో పాల్గొన్న గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా



ఐటి కారిడార్, కేబుల్ బ్రిడ్జి మీదుగా కొనసాగుతున్న సైకిల్ ర్యాలీ



ఖాట్మండు కళింగ సాహిత్య ఉత్సవంలో కవితా సంకలనం ఆవిష్కరించిన దృశ్యం

## ఖాట్మండు కళింగ సాహిత్య ఉత్సవంలో కవితా సంకలనం ఆవిష్కరణ

**హైదరాబాద్, జూన్ 7 ( ప్రభాతవార్త) :** నేపాల్ రాజధాని ఖాట్మండులో జరుగుతున్న ప్రతిష్ఠాత్మక ఖాట్మండు కళింగ సాహిత్య ఉత్సవం ఆదివారం నాల్గవ ఎడిషన్‌లో విశేష ఆదరణ లభించింది. ఈ అంతర్జాతీయ వేదికపై రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, ప్రముఖ రచయిత బి.పి. ఆచార్య సంపాదకత్వం వహించిన కవితా సంకలనాన్ని అంతర్జాతీయ పాఠకుల కోసం ఆవిష్కరించారు. నేపాల్ మాజీ ప్రధానమంత్రి, మాజీ ప్రధాన న్యాయమూర్తి సుశీలా కార్కి ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత, ప్రముఖ ఒడియా రచయిత్రి డాక్టర్ ప్రతిభారాయ్‌తోపాటు భారత్, నేపాల్ దేశాలకు చెందిన పలువురు ప్రముఖ సాహితీవేత్తలు, కవులు, పరిశోధకులు పాల్గొన్నారు. పోయెమ్స్ అక్రోస్ టైం కవితా సంకలనానికి ఒక విలక్షణమైన ప్రత్యేకత ఉంది. ఒకే కుటుంబానికి చెందిన మూడు తరాల సాహిత్య సృజనను ఈ పుస్తకం ద్వారా పాఠకుల ముందుకు తీసుకొచ్చారు. ఇందులో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బి.పి. ఆచార్య కవితలతో పాటు, ఆయన పెద్దన్నయ్య (దివంగత) డాక్టర్ డి.పి. ఆచార్య కవితలు, ప్రస్తుతం విదేశాల్లో స్థిరపడిన మేనల్లుడు అన్షుమన్ రాసిన కవితలను పొందుపరిచారు. ఈ సంకలనంలోని కవితలు కాలం, అనుభవాలు, భిన్న సంస్కృతులు, భౌగోళిక నేపథ్యాలను విశ్లేషిస్తూనే.. మానవీయ భావోద్వేగాలు, కుటుంబ బంధాలు, జీవన తాత్వికత, కాల ప్రవాహం వంటి విశ్వవ్యాప్త అంశాలను ప్రతిబింబించాయని సాహిత్య విమర్శకులు కొనియాడారు. మూడుతరాల విభిన్న సాహిత్య దృక్పథాలను సమన్వయం చేస్తూ సాగిన ఈ సంకలనం, సమకాలీన ఆంగ్ల కవిత్వరంగంలో విశిష్టమైన కృషిగా నిలుస్తుందని వారు అభిప్రాయపడ్డారు.



## రాజీవ్‌గృహకల్ప కాలనీకి హైస్కూల్ అవసరం

**కీసర, జూన్7, ప్రభాతవార్త :** అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకువెళ్తామని మేడ్చల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్, కాంగ్రెస్ పార్టీ బి బ్లాక్ మహిళా అధ్యక్షురాలు ఈగ శ్వేత రాజు ముదిరాజు అన్నారు. ఆదివారం కీసర సర్కిల్ పరిధిలోని రాజీవ్‌గృహకల్ప కాలనీ, డబుల్ బెడ్‌రూం కాలనీ అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో 19వ జ్ఞానమాల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజీవ్‌గృహకల్ప కాలనీ, డబుల్ బెడ్‌రూం హౌసింగ్ కాలనీలో చాలామంది విద్యార్థులు హైస్కూల్ లేక ఇతర గ్రామాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. ఇక్కడ హై స్కూల్ ఏర్పాటు చేస్తే అందరూ చదువుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ విషయంలో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని తెలిపారు. సంఘం అధ్యక్షులు గొల్లూరి రాజు మాట్లాడుతూ అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో జ్ఞానమాలతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు. ఇందుకోసం కార్యచరణ చేపడతామని, త్వరలోనే కమిటీ ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. రాజీవ్‌గృహకల్ప కాలనీ అధ్యక్షులు ఈగ రాజు ముదిరాజు, అంబేద్కర్ సంఘ గౌరవ అధ్యక్షులు మంగళపురి వెంకటేష్, ప్రధాన కార్యదర్శి సురేష్ ముదిరాజు, సంఘం ఉపాధ్యక్షులు పులిపాక తిరుపతి, సలహదారులు మాదాసి రవి, షాపర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నరేష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఇన్‌స్ట్రక్టర్లు, ఆయా పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

**షాద్‌నగర్, జూన్ 7, ప్రభాతవార్త :** ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో 202627 విద్యా సంవత్సరానికి ప్రీప్రైమరీ తరగతులు మంజూరు అయినట్లు ఫరూక్ నగర్ మండల విద్యాధికారి మనోహర్ తెలిపారు. పీఎస్ వెలిజర్లతో పాటు షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని పీఎస్ రాంనగర్ కాలనీ, పీఎస్ క్రిస్టియన్ కాలనీ, పీఎస్ ఆర్టీసీ కాలనీ, పీఎస్ వెంకటేశ్వర కాలనీ పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులు ప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు. ఈ తరగతుల నిర్వహణ కోసం ఇన్‌స్ట్రక్టర్ (అర్హత: ఇంటర్మీడియట్) మరియు ఆయా (అర్హత: 7వ తరగతి) పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 10వ తేదీ బుధవారం సాయంత్రంలోపు (ఆదివారం సెలవు) మండల విద్యా వనరుల కేంద్రం (ఎంఆర్సీ) ఫరూఖ్‌నగర్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. టీచర్ ట్రైనింగ్ (డీఎల్ఎడ్/డీఈడ్) అర్హత కలిగిన వారికి, అలాగే స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు ఎంఈఓ మనోహర్ తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9603554546 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ మేరకు మండల విద్యాధికారి మనోహర్ మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.



విద్యార్థులకు కరాటే నేర్పుతున్న కోచ్ రాములు

## కరాటే శిక్షణతో బాలికలకు స్వీయరక్షణ

**దోమ, జూన్ 7, ప్రభాతవార్త:** పాఠశాలలో చదివే విద్యార్థులందరు తప్పని సరిగా తైక్వాండో (కరాటే) నేర్చుకోవాలని తైక్వాండో మాస్టర్ బోయిని రాములు సూచించారు. ఆదివారం దోమ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో ముగిసిన కరాటే శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. ఏప్రిల్ 25 నుండి జూన్ 7 వరకు దోమ, పాలెపల్లి, అయినాపూర్, లింగన్‌పల్లి, రాకొండ, తిమాయపల్లి, ఉదన్‌రావుపల్లి, ఖమ్మంనాచారం, గ్రామాల పాఠశాల విద్యార్థులకు కరాటే శిక్షణ ఇచ్చామన్నారు. నేటి సమాజంలో బాలికల ఆత్మరక్షణ కోసం పంచెస్, కిక్స్, లాక్స్, త్రోస్, డిపెన్స్, నాన్‌చాక్స్‌లో నైపుణ్యం పొందాల్సిన అవసరం ఉందన్నారు. శిక్షణ పొందిన విద్యార్థులకు త్వరలో సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు.

## పెట్రో ధరల పెరుగుదలను నిరసిస్తూ 10న ధర్నా

**చేవెళ్ల, జూన్ 6, ప్రభాతవార్త :** పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10వ తేదీన రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య తెలిపారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు చేవెళ్ల నియోజకవర్గం ఇన్చార్జి కె రామస్వామి అధ్యక్షతన ఆదివారం మండల కేంద్రంలోని భారత కమ్యూనిస్టు పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ధర్నా కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు, బడుగు వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. బిజెపి పాలనలో సామాన్యుడి బతుకు భారంగా మారింది అన్నారు. నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, దేశంలో పేదరికం నిరుద్యోగం పెరుగుతుంటే కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తి నట్లు వ్యవహరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వడ్ల సత్యనారాయణ ఇన్సాబు జిల్లా అధ్యక్షుడు ఎండి మక్బూల్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్ల మంజుల రామన్నగూడెం గ్రామ శాఖ కార్యదర్శి పాపయ్య తదితరులు పాల్గొన్నారు.



## గురుకుల పాఠశాలలో సేవలకు టెండర్లు

**మేడ్చల్, జూన్ 7, ప్రభాతవార్త :** ఎల్లంపేట మున్సిపల్ పరిధి సోమారం గ్రామంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకులం బాలికల విద్యాలయానికి ఆహార పదార్థాలను సరఫరా చేసేందుకు గాను టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు ఆ విద్యాలయ ప్రిన్సిపల్ మమత ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గురుకులానికి అవసరమగు కూరగాయలు, పాలు, పండ్లు, స్కిన్ లెస్ చికెన్, మటన్ సరఫరా, క్యాటరింగ్ సేవలు, స్వీపింగ్, శానిటేషన్ కోసం బిడ్ టెండర్లను స్వీకరించనున్నామని తెలిపారు. అందుకు దరఖాస్తు ఫారం ధర రూ. 2 వేలు కాగా, సాధారణ అడ్వాన్స్ డిపాజిట్ రూ.30 వేలు ఉందని, ఎస్సీ, ఎస్టీలకు 40 శాతం రాయితీతో అడ్వాన్స్ డిపాజిట్ రూ. 18 వేలుగా నిర్ణహించబడిందని తెలిపారు. ఈ డిపాజిట్ సొమ్మును డీడీ రూపంలో దరఖాస్తు ఫారంతో పాటు ఈ నెల 15వ తేదీ వరకు గురుకులంలో అందజేయాలని కోరారు. పూర్తి చేసిన దరఖాస్తులను 15వ తేదీ సాయంత్రం 4 గంటల లోపు సమర్పించాలని, ఈ నెల 17న జిల్లా అదనపు కలెక్టర్ కార్యాలయంలో టెండర్లను తెరుస్తారని తెలిపారు. ముందస్తు నోటీసు లేకుండా ఈ టెండరును వాయిదా వేయుటకు జిల్లా అదనపు కలెక్టర్‌కు పూర్తి అధికారం ఉందని, ఆశావాహులు నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.



## ఉపాధ్యాయులకు పూర్వ విద్యార్థుల సత్కారం

**తలకొండపల్లి జూన్ 7, ప్రభాతవార్త :** తలకొండపల్లి మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఒకచోట కలిసి పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. రాంపూర్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన 2007-08, బ్యాచ్‌కు చెందిన పదవ తరగతి విద్యార్థులు వెంకట్రావుపేట్ గ్రామంలోని పద్మ గార్డెన్‌లో కలిసి తమ పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. 18 సంవత్సరాల క్రితం పదవ తరగతిలో అల్లరి చేసిన విద్యార్థులు, బాగా చదువుకున్న విద్యార్థులు బాగోగులు తెలుసుకున్నారు. అనంతరం తమకు విద్య నేర్పిన ఉపాధ్యాయులను శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు కాశన్న వెంకటస్వామి ప్రమోద్ బద్రి నాయక్ అశోక్ మహిపాల్ రెడ్డి తోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల స్లాబు పనులు ప్రారంభం

**జిల్లెడు చౌదరిగూడ, జూన్ 7 ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వ పాలన దొలన పాలన కాదని ప్రజా పాలన అని ఆ పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం జిల్లెడు చౌదరిగూడ మండలంలోని పెద్ద ఎల్కిచర్ల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు స్లాబు పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పనులు జరుగుతున్నాయన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందని, పేదల అభ్యున్నతి కోసం ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని నూతన పథకాలు అమలు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి డైరెక్టర్ వెంకటనర్సింహారెడ్డి, బిసి సెల్ మండల అధ్యక్షుడు వడ్డె వెంకట్‌రాములు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కుమార్, శ్రీనివాస్, శివ, బందయ్య, ఆదిత్య, నర్సింహులు, యాదయ్య, శ్రీశైలం, రాములు, రమేష్, నరేష్, సుమన్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రాజెక్టులను పటాలెక్కిస్తుంటే విమర్శలా!

## బిఆర్ఎస్‌పై కాంగ్రెస్ నేతల ధ్వజం

**షాద్‌నగర్, జూన్ 7, ప్రభాతవార్త :** పాలమూరు ప్రాజెక్టు విషయంలో బీఆర్ఎస్ నాయకులు సిగ్గు తప్పిన మాటలు మాట్లాడటం మానుకోవాలని గిరిజన ఆదివాసి కోఆర్డినేటర్, షాద్‌నగర్ కాంగ్రెస్ సమన్వయ కమిటీ కన్వీనర్ పి. రఘు హెచ్చరించారు. ఆదివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏడాది కాలంలో ప్రాజెక్టును పూర్తి చేయాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి ముందుకు సాగుతుంటే మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్, లక్ష్మారెడ్డి, తదితర మాజీ ఎమ్మెల్యేలు విమర్శలు చేయడం తగదన్నారు. కేవలం పాల మూరు ప్రాజెక్టును, లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్‌ను ఒక సెంటిమెంటుగా మార్చుకొని పదేళ్లపాటు అధికారంలోకి వచ్చిన బీఆర్ ఎస్ నాయకులు ఈ ప్రాజెక్టును పూర్తిగా పక్కన పెట్టారని ఆగ్రహించారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్ మాట్లాడుతూ గతంలో నీళ్లు, నిధులు, నియామకాలు అంటూ పాలమూరు జిల్లాకు వచ్చి పాలమూరు రంగా రెడ్డి ప్రాజెక్టుపై ఆశలు పెంచి అధికారంలోకి వచ్చిన కేసీఆర్ షాద్‌నగర్‌లో లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ కోసం తట్ట మట్టి కూడా ఎత్తలేదన్నారు. మార్కెట్ కమిటీ



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

డైరెక్టర్ కరుణాకర్ మాట్లాడుతూ మూడు రోజులపాటు ప్రాజెక్టుల విషయంలో సమీక్షలు నిర్వహించి పాలమూరు ప్రాజెక్టుకు ఒక రూపకల్పన చేస్తుంటే ప్రతిపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నాయన్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత చెంది తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. కేవలం పాలమూరు ప్రాజెక్టు, లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ల వల్లనే కెసిఆర్‌కు ఎంపీగా అవకాశం వచ్చిందని గుర్తు చేశారు. కానీ దానిని పూర్తిగా విస్మరించి జిల్లా ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. కొందుర్గు మండల పార్టీ అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, సీనియర్ నాయకులు ఎండి ఖాదర్ గోరి, నడికూడ యాదగిరి యాదవ్, జంగయ్య తదితరులు పాల్గొ



## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**శంకర్‌పల్లి, జూన్ 7, ప్రభాతవార్త :** శంకర్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల (1995-96 ఎస్ఎస్‌సీ బ్యాచ్) ఆత్మీయ సమ్మేళన సమావేశం ఆదివారం నాడు స్థానిక జులకంటి కిష్టారెడ్డి గార్డెన్‌లో ఘనగా జరిగింది. దశాబ్దాల కాలం తర్వాత సహాధ్యాయులంతా ఒకే వేదికపైకి చేరడంతో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో, వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులంతా ఒకరినొకరు ఆలింగనం చేసుకుని, తమ చిన్ననాటి ముచ్చట్లను, పాఠశాల పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. విభిన్న రంగాలలో ఉన్నత స్థానాల్లో రాణిస్తున్న తమ తోటి మిత్రులను ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించుకున్నారు. దేశ రక్షణలో భాగస్వాములై ఆర్మీలో విశేష సేవలందించిన పూర్వ విద్యార్థులను ఈ సమావేశంలో సహచర మిత్రులు ఘనంగా సన్మానించారు. బుల్కాపూర్ గ్రామానికి చెందిన పుష్పాల్ రెడ్డి, లక్ష్మారెడ్డి గూడ గ్రామానికి చెందిన సత్యనారాయణ ఆర్మీ జవాన్లుగా దేశానికి వారు చేసిన సేవలను కొనియాడుతూ, వారిని శాలువాలతో సత్కరించి ఘనంగా సన్మానించారు. అదేవిదంగా విద్య, పోలీస్, ప్రభుత్వ, న్యాయ, జర్నలిజం, వ్యవసాయం, రియల్ ఎస్టేట్, సినీ రంగాల్లో స్థిర పడ్డ వారి సేవలను సమావేశంలో కొనియాడారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు ఎండీ సలీమ్ పాషా మాట్లాడుతూ జూలై 5వ తేదీన తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించేందుకు భారీ ఎత్తున గురుపూజోత్సవ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఆ కార్యక్రమానికి పూర్వ విద్యార్థులంతా హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 1995-96 ఎస్ ఎస్ సీ బ్యాచ్‌కు చెందిన 60 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. అంతకుముందు మృతి చెందిన పలువురికి సంతాప సూచకంగా రెండు నిమిషాలు మోనం పాటించారు.



## నృత్య శిక్షణ నిరంతరం సాగాలి

**షాద్‌నగర్, జూన్ 7, ప్రభాతవార్త :** రాగ్ని కూచిపూడి కళా నిలయం ఆధ్వర్యంలో శివ మారుతి గీతా అయ్యప్ప కళ్యాణ మండపంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా నాట్యాచార్యుడు రాగిని ఆధ్వర్యంలో 41 రోజులపాటు కూచిపూడి నృత్యాన్ని నేర్పించారు. 50 మంది శిక్షణ పొందారు. శిబిరం ముగింపు కార్యక్రమాన్ని ఠాగూర్ స్కూల్ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. హరీశ్ శర్మ వ్యాఖ్యాతగా వ్యవహరించగా, రవిశర్మ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా మునిసిపల్ చైర్మన్ అగ్గనూరి బసవేశ్వర్, టాగూర్ స్కూల్ చైర్మన్ రాజేంద్ర ప్రసాద్, విశ్వహిందూ పరిషత్ నాయకులు బండారు రమేష్, ప్రముఖ సామాజిక వేత్త, కార్మిక నాయకులు పినపాక ప్రభాకర్, రిటైర్డ్ తహశీల్దార్ రామారావు, ప్రముఖ న్యాయవాది చెంది మహేందర్ రెడ్డి పాల్గొన్నారు, శిక్షణ పొందిన విద్యార్థినిలకు మెమెంటోలు అందజేశారు. కూచిపూడి నృత్యానికి ప్రాణం పోసి వందల మందికి శిక్షణను ఇస్తున్న రాగినికి అభినందనలు తెలిపారు. ఈ శిక్షణ నిరంతరంగా కొనసాగించే విధంగా చూడాలని కోరారు. ప్రముఖ జ్యోతిషులు రవిశర్మ దంపతులను, గురువు రాగినిని సన్మానించారు. నృత్య గురువు రాగిని మాట్లాడుతూ శివ మారుతి కళ్యాణ మండపంలో వారంకు మూడు క్లాసులు చొప్పున నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినుల తల్లి తండ్రులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం

**శామీర్‌పేట, జూన్ 7, ప్రభాతవార్త :** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తితో పేదల సొంతింటి కలను ప్రభుత్వం నెరవేరుస్తుందని మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బి.నర్సింలు యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం మూడు చింతలపల్లి మున్సిపాల్టీలోని కేశవరంలోని 24వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి కావటంతో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి ఆ తరువాత లబ్దిదారులతో ఆయనతో పాటు మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు దోసకాయల వెంకటేశ, స్థానిక కౌన్సిలర్లు కె.మాదవిభూమేశ్‌గౌడ్, బి.మల్లేశ్‌యాదవ్‌లు కూడ పాల్గొని గృహప్రవేశం చేయించారు. సకాలంలో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకుని గృహప్రవేశం చేసిన లబ్ధిదారులను వారు సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగ మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలుయాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేద కుటుంబాల గృహ కలను నిజం చేస్తూ ఇంది రమ్మ ఇళ్లను మంజూరు చేసి ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేస్తుందని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంకు ప్రభుత్వం 5లక్షల రూపాయలు అందిస్తుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవానికి సహకరించిన వారిని లబ్దిదారులు అథితులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మూడుచింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు దోసకాయల వెంకటేశ, స్థానిక కౌన్సిలర్లు కె.మాదవిభూమేశ్‌గౌడ్, బి.మల్లేశ్ యాదవ్, మాజీ వైస్‌ఎంపిపి ఎం.శ్రీనివాస్‌రెడ్డి, మైనార్టీ మున్సిపల్ సెల్ అధ్యక్షులు ఎండి యూసుఫ్, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, ప్రసాద్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



బోరు ప్రారంభోత్సవంలో పాల్గొన్న దాత లక్ష్మారెడ్డి

## ఎస్‌సి కాలనీకి బోరు మోటర్ విరాళం

**శామీర్‌పేట, జూన్ 7, ప్రభాతవార్త:** బాబగూడ గ్రామంలోని ఎస్సీకాలనీలో మంచినీటి సమస్య ఉన్నందున బోరు బావిలో మోటర్ లేకపోవటంతో బొమ్మరాసిపేట్ గ్రామానికి చెందిన దాత అయ్యన్నగారి లక్ష్మారెడ్డి బోరు మోటర్‌ను అందజేశారు. ఆదివారం ఉదయం శామీర్‌పేట మండలంలోని బాబగూడ గ్రామంలోని ఎస్సీ కాలనీలో నీటి సమస్య ఉందని ఆయన దృష్టికి ఆయన స్నేహితుడు దాత లక్ష్మారెడ్డికి వివరించగ ముందుకు వచ్చి బోర్ మోటర్‌ను విరాళంగ అందజేసినట్లు, దీంతో ఆ బోర్‌లో మోటర్ దింపి నీరు రావటంతో నీటి సమస్యను పరిష్కరించటం జరిగిందని పలువురు సంతోషం వ్యక్తం చేశారు. దాత లక్ష్మారెడ్డికి నాయకులు సందని ఆనంద్, పలువురు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బొమ్మరాసిపేట్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ అధ్యక్షులు పంబలి అశోక్, రాచకొండ గణేశ్, నక్క మనోహర్ యాదవ్, ములుగు రాజు, ఈ ఏసుదాసు, బాబగూడ గ్రామ కాంగ్రెస్ సీనియర్ నాయకులు సందని ఆనంద్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు నోముల వాసుదేవ్‌రెడ్డి, నాయకులు మేడి సత్యనారాయణ, మేడి స్వామి, ఇస్తారి, తదితరులు పాల్గొన్నారు.

## కొండాపూర్‌లో వ్యక్తి అదృశ్యం

**ఘట్‌కేసర్, జూన్ 7, ప్రభాతవార్త:** దుకాణంకు వెళ్తిన ఓవ్యక్తి అదృశ్యమైన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఘట్‌కేసర్ డివిజన్ కొండాపూర్‌లో ఉంటున్న మోఘావత్ మోతిలాల్ (41) ఈనెల 5న ఉదయం 11 గంటల సమయంలో తన తల్లితో కలిసి కిరాణాదుకాణంకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి సాయంత్రం వరకు తిరిగి రాకపోవడంతో అంతటా వెతికినా ఆచూకి లభించకపోగా ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

## ప్రభుత్వ డిప్యూటీ ఖాజీగా మహమ్మద్ రఫీక్..

**కేశంపేట, జూన్ 7, ప్రభాతవార్త :** కేశంపేట మండలానికి ప్రభుత్వ డిప్యూటీ ఖాజీగా మహమ్మద్ రఫీక్ నియమితులయ్యారు. ముస్లిం సమాజానికి సంబంధించిన వివాహాలు, విడాకులు ఇతర ధార్మిక వ్యవహారాల నిర్వహణలో డిప్యూటీ ఖాజీ కీలక బాధ్యతలు నిర్వర్తిస్తారు. ఈ మేరకు కేశంపేట మండల సదర్ ఖాజీ సయ్యద్ ఇఫ్తేఖార్ అలీ ఖాద్రి చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందజేశారు. డిప్యూటీ ఖాజీ పదవి నేరుగా ప్రభుత్వ శాఖ పరిధిలో కాకుండా, మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని వక్ఫ్ బోర్డు పరిధిలో పనిచేస్తుంది. ఈ పదవి ద్వారా ముస్లిం వ్యక్తిగత చట్టాలకు అనుగుణంగా వివాహాలు, తలాక్ తదితర ధార్మిక కార్యక్రమాల నిర్వహణ, ధృవీకరణ వంటి బాధ్యతలు నిర్వహించ బడతాయి. మహమ్మద్ రఫీక్ నియామకంతో కేశంపేట మండలంలోని ముస్లిం ప్రజలకు సంబంధిత సేవలు మరింత సులభంగా అందుబాటులోకి రానున్నాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, మత పెద్దలు మరియు సామాజిక నాయకులు మహమ్మద్ రఫీక్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. ముస్లిం ప్రజలు తమ అవసరాలకు అనుగుణంగా ఎప్పుడైనా తనతో సంప్రదించవచ్చని ఆయన విజ్ఞప్తి చేశారు.





కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న మాజీ సర్పంచ్ రమేష్ గౌడ్

## అయ్యప్ప సన్నిధానానికి రూ.75 వేలు విరాళం

**నందిగామ, జూన్ 6, ప్రభాతవార్త :** నందిగామ మండలం రంగాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ అయ్యప్ప స్వామి సన్నిధానం నిర్మాణం కోసం రంగాపూర్ మాజీ సర్పంచ్ ఎనుగొండ రమేష్ గౌడ్ ఆదివారం రూ.75 వేలు విరాళాన్ని సన్నిధానం కమిటీ సభ్యులకు అందజేశారు. భక్తి మార్గం చేతనే.. ముక్తి మార్గం లభిస్తుందని, ఆధ్యాత్మిక చింతనతో అయ్యప్ప సన్నిధానానికి విరాళం అందజేసిన మాజీ సర్పంచ్ రమేష్ గౌడ్ ను అయ్యప్ప భక్త సమాజం,గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో సన్నిధానం కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



పిడుగుపాటుకు మృతి చెందిన ఆవు

## సీతారాంపూర్‌లో గాలివానకు అపార నష్టం

**షాబాద్, జూన్ 7, ప్రభాతవార్త :** షాబాద్ మండలంలో కురిసిన అకాల వర్షానికి తీవ్ర నష్టం జరిగింది. సీతారాంపూర్ గ్రామంలో ముద్దంగుల రాజు సుమలత రేకుల ఇల్లు పైకప్పు కూలిపోయింది. ఈ సందర్భంగా తోపుగొండ పావని చెన్నయ్య మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి సాయం వచ్చేలా చేస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా దేవునిగడ్డ గ్రామానికి చెందిన కురువ రామచంద్రయ్య ఆవు పిడుగు పడడం వల్ల మృతి చెందిందిజ. ఆవు ధర కనీసం రూ.లక్ష పైనే ఉంటుంది రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

## ఐదు తులాల గోల్డ్ చైన్ చోరీ

**కీసర, జూన్7, ప్రభాతవార్త :** ఘట్‌కేసర్ సర్కిల్ నాగారం డివిజన్ పరిధిలోని గోధుమకుంటల గ్రామంలో చైన్ స్నాచర్లు రెచ్చిపోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గోధుమకుంట గ్రామంలో ఒక గుడిసెలో హోటల్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న పుట్ట సువర్ణ మెడలోంచి సుమారు ఐదు తులాల చైన్‌ని దుండగులు ఎత్తుకెళ్లారు. దుండగులు రాత్రి వేళల్లో రెక్కి నిర్వహించి ఒంటరిగా ఉన్న మహిళలను టార్గెట్ చేస్తున్నారు. రాత్రి వేళల్లో రెక్కి నిర్వహిస్తున్నట్లు సీసీ కెమెరాలలో బయటపడింది. దుండగుల కోసం పోలీసులు పలు కోణాల్లో గాలిస్తున్నారు. ఈ కేసును కీసర పోలీసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## కరెంటు స్తంభాన్ని ఢీ కొని నేవీ ఉద్యోగి మృతి

**కీసర, జూన్6, ప్రభాతవార్త :** కరెంటు స్తంభాన్ని ఢీ కొని యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో చీర్యాల చౌరస్తాలో జరిగింది. సిఐ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం జమ్ముకాశ్మీర్‌కు చెందిన అజిత్ (32) విశాఖపట్టణం నేవీలో పని చేస్తున్నాడు. నాలుగు వారాల శిక్షణ నిమిత్తం కొరకు యాద్గార్‌పల్లిలోని డిఆర్‌డిఓకు వచ్చాడు.

పని నిమిత్తం అజిత్ ద్విచక్ర వాహనంపై తన స్నేహి తుడు గణేష్ (32) వెంట తీసుకుని ఈసిఐఎల్‌కు వెళ్లాడు. తిరిగి వస్తుండగా చీర్యాల చౌరస్తా సమీపంలోని మూల మలుపు వద్ద అదుపు తప్పిన ద్విచక్ర వాహనం అతి వేగంగా వెళ్లి రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టాడు. హెల్మెట్ ఉన్నప్పటికి తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వెనకాల కూర్చున్న గణేష్‌కి తీవ్ర గాయాలు కాగా అతనిని చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కీసర పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఇంటి నిర్మాణానికి సిమెంట్ పంపిణీ

**తలకొండపల్లి, జూన్ 7, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల పరిధిలోని లింగరావుపల్లి గ్రామానికి చెందిన టేకురి మల్లేష్ ఇంటి నిర్మాణం కోసం గ్రామ సర్పంచ్ కాసు శ్రీనివాసరెడ్డి సొంతంగా సిమెంటును అందజేశారు. నిరుపేదవాడైన టేకురి మల్లేష్ ఇంటి నిర్మాణానికి ఆర్థిక స్థోమత లేకపోవడంతో పూర్తయిన ఇల్లును సిమెంటు చేయక వదిలేశాడు. దీంతో గమనించిన స్థానిక సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి ఇంటికి అవసరమాకు సిమెంటును ఉచితంగా పంపిణీ చేసి ఆదుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని నిరుపేద వారికి వ్యక్తిగతంగా తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారుడు గ్రామస్తులు ఉన్నారు.

# చేస్తున్న అభివృద్ధి పనులను చూపిస్తాం రండి

## మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డికి కాంగ్రెస్ నాయకుల సవాల్

**కొడంగల్, జూన్ 7 ప్రభాతవార్త :** అన్ని రంగాల్లో వెనుకబడిన కొడంగల్ నియోజకవర్గం ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ తిరుపతి రెడ్డి నేతృత్వంలో అభివృద్ధి పనులతో శరవేగంగా దూసుకుపోతుందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. రాష్ట్రంలోనే కొడంగల్ అందరి దృష్టిని ఆకర్షిస్తుంటే, ఎక్కడ తన ఉనికి కోల్పోతుందో అన్న భయంతో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి కల్లబొల్లి మాటలతో పగటి కలలు కంటున్నారని, ఇకపై ఆయన ఆటలు సాగవని మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్, టీపీసీసీ ప్రతినిధి ఎండీ యుసుఫ్, మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్యగౌడ్లు తీవ్రంగా విమర్శించారు. ఆదివారం కొడంగల్‌లోని సీఎం రేవంత్ రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే చేసిన ఆరోపణలను తిప్పికొట్టారు. గత 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో కొడంగల్‌లో జరిగిన అభివృద్ధికి, ప్రస్తుత రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో జరుగుతున్న అభివృద్ధికి నక్కకూ నాగలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి జరగలేదంటున్న మాజీ ఎమ్మెల్యే కళ్ళు తెరిచి చూడాలని, లేదంటే తమతో వస్తే తామే స్వయంగా తిరిగి అభివృద్ధిని చూపించేందుకు సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు. ప్రస్తుతం కొడంగల్ నియోజకవర్గంలో సాగు, తాగునీటి కోసం కొడంగల్‌నారాయణపేట్ ఎత్తిపోతల పథకం పనులు వేగంగా కొనసాగుతున్నాయని, అలాగే కృష్ణా-వికారాబాద్ రైల్వే పనులు కూడా త్వరలోనే ప్రారంభం కానున్నాయని వారు వెల్లడించారు. వేలాది కోట్ల రూపాయల నిధులతో విద్యా, వైద్యం, రోడ్ల అభివృద్ధి పనులు యుద్ధప్రాతిపదికన కొనసాగుతున్నాయని చెప్పారు. లగచర్లలో ఇండస్ట్రియల్ కారిడార్, 224 ఎకరాల్లో ఎడ్యుకేషన్ హబ్ ఏర్పాటుతో పాటు నియోజకవర్గంలోని ప్రతి తండా, ప్రతి గ్రామానికి బీటీ రోడ్డు పనులు స్పష్టంగా కనిపిస్తున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజీనామాను డిమాండ్ చేసే స్థాయి మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డికి లేదని, దమ్ముంటే ముందుగా మీ నాయకులైన కేసీఆర్, కేటీఆర్‌ల చేత రాజీనామా చేయించి బైఎలక్షన్‌లో గెలిపిస్తే... అప్పుడు తాము ఆలోచిస్తామని ప్రతిసవాల్ విసిరారు. సీఎం రేవంత్ రెడ్డి ఒక విజన్‌తో



పనిచేస్తున్నారని, మాజీ ఎమ్మెల్యేలా చిల్లర మాటలు, చిల్లర చేష్టలతో కాలయాపన చేయడం లేదని మండిపడ్డారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసే ప్రజలు గత సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బ్రహ్మరథం పట్టారని, మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అడ్రస్ గల్లంతయిందని, అయినా మాజీ ఎమ్మెల్యేకు సిగ్గు రావడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా పార్టీలకతీతంగా జరుగుతున్న అభివృద్ధికి మాజీ ఎమ్మెల్యే సహకరించాలని, లేదంటే ప్రజలు కొడంగల్ నుండి తన్ని తరిమికొట్టేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

మరోవైపు, రైతులు పండించిన వరి కొనుగోలులో చివరి గింజ వరకు కొనేందుకు ప్రభుత్వం పూర్తిగా సిద్ధంగా ఉందని నాయకులు స్పష్టం చేశారు. ఇదివరకే నియోజకవర్గంలో 6 లక్షల క్వింటాళ్ల వరి ధాన్యాల కొనుగోలుతో దాదాపు 70 శాతం ప్రక్రియ పూర్తయిందని, మిగిలిన 30 శాతం కొనుగోళ్లను కూడా త్వరలోనే పూర్తి చేస్తామని గుర్తుచేశారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్ నాయక్, కౌన్సిలర్లు హమీద్, మునీర్, రమేష్ బాబు, దాము, సర్పంచ్‌లు ఆసీఫ్ ఖాన్, కాంగ్రెస్ నాయకులు యాదిరెడ్డి, సోమశేఖర్, రాము, దస్తప్ప, దత్తాత్రేయరావు, శివప్ప, లక్ష్మణ్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తదితరులు పాల్గొన్నారు